# సరికొత్త పాతకథ



శిష్టా వెంకట రమణారాజు

ఆకాశంలో దట్టంగా అలుముకున్నాయి మబ్బులు. నల్లటి మేఘాలు కారు చీకటిలా వ్యాపించాయి. చలికాలం కావడం వల్ల ఆ చెవిలోంచి దూసుకుపోతోందా అనిపిస్తోంది. స్వెట్టర్లు ఎన్ని కప్పుకున్నా చలి ఆగడంలేదు పిల్లలు మంచం మీద ముడుచుకుని పడుకున్నారు. పవిత్ర భర్త పిల్లలిద్దర్నీ దగ్గరగా లాక్కుని తను మాత్రం వెల్లకిలా పడుకున్నారు. తండ్రి కౌగిలిలో వెచ్చదనానికిమూడెంకకి మధ్య గాఢనిద్రలో వున్నారు పిల్లలు.

దీపం మిణుకు మిణుకు మంటోంది. వర్షం వస్తే రేకుషెడ్ చిల్లుల్లోంచి ధారాపాతంగా కురుస్తుంది. ఆ కురిసే చోట గిన్నెలు, గ్లాసులూ పెడితే కొద్దిసేపు పడుకోవచ్చు. వర్షాకాలం వస్తే భార్యాభర్తా యిద్దరూ వొంతుల ప్రకారం నీళ్ళు గదినిండా కారిపోకుండా జాగారం చేస్తుంటారు.

సారంగం ఫ్యాక్టరీనుంచి రాగానే పవిత్ర పెట్టినదేదో తినేసి, షెల్లల్తో చలిగాలికి యింక కూర్చోలేక పోయాడు. శ్రమపడివచ్చినందుకు మంచి నిద్రలో వున్నాడు. శీతాకాలం కనుక ఎవరిళ్ళల్లో వాళ్ళు హాయిగా పడుకున్నారు. ఎనిమిది గంటలు కాకముందే పవిత్ర టైము అంచనా వేసుకుంది. ఎనిమిదిన్నర కంటే ఎక్కువకాదు. మెల్లిగా లేచి తలుపులు తెరిచి బయటికి అడుగుపెట్టింది. గొప్పింటి మహానుభావులు స్వెటర్లలో క్విల్ట్ కప్పుకుని దర్జాగా నిద్రపోయేసమయం. పవిత్ర చీరకి అక్కడక్కడ చిరుగులున్నాయి. వాటిని శ్రద్ధగాకుట్టుకుంది. నూలు తక్కువై చీర పలచబడి మరీ వణికించేస్తోంది. తలమీదుగా చెవులు కప్పుకుని కొంగుని చేతిలో వుంచుకుని గబగబా అడుగులు వేస్తోంది. కుక్కపిల్లలు పేటలోని పవిత్రని చూస్తూ తోకాడిస్తున్నాయి. ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. పవిత్రకి ఈ చలికి, రాబోయే వర్షానికి జరిగే ఆపద తలుచుకుంటె గుండె గుభేలుమంటోంది. వర్షం ఎక్కువైతే గోడలు నేలమట్టం అయిపోతాయి గాలి ఉధృతంగావీచిందంటే పైకప్పులు ఎగిరిపోతాయి. అడుగులు సాగిసాగి చివరకు మేడ ముందు ఆగిపోయాయి. పవిత్ర ఒక్కసారి వెను తిరిగి తన యింటివైపు చూసింది. తరతరాల గొప్పా బీదా తారతమ్యానికిచిహ్నంగా వున్నాయి తన యిల్లూ, ప్రతాప్ ఇల్లూ తలుపులు వుండే చోట గాడ్రెజ్ కంపెనీ తాలూకు తాళం, డెకాలమ్ వున్న ద్వారం వుంది.

తలుపులు త్రోసి ముందుకు వెళ్ళింది. పవిత్రని యీ చీకటిలో ఎవరూ గమనించలేదు ప్రతాప్ స్వంతంగా ఎలక్ట్రికల్‌షాప్ పెట్టుకున్నాడు. అది అతని బి యీ చదివినందుకు కాలక్షేపం కోసం. అతని భార్య కవిత తను కాపురానికి వస్తూ ఓ లక్షరూపాయలు తెచ్చుకుంది. అత్తింటా పుట్టింటా డబ్బుకేమీ కొదవలేదు. కవిత పుట్టింటికి వెళ్ళింది. ప్రతాప్ వరంగల్ నుంచి వచ్చి యీ మధ్యే యిక్కడ స్థిపడ్డాడు. ఈ వివరాలన్నీ పనిమనిషి బాలమ్మ చెప్పింది. పవిత్రకి. ప్రవిత్రకి ప్రత్యేకం పని మనిషిలేదు. పక్కవాళ్ళింట్లో చేస్తుంది, బాలమ్మ. కొత్తగా వచ్చిన ఇంజనీర్ ప్రతాప్ అనివిని ఆసక్తిగా అడిగింది. తీగలాగితే డొంక కదిలినట్లు పనిమనిషి పూర్తి వివరాలు సేకరించిమరీచెప్పింది. పవిత్ర తెగించి గదిలో అడుగుపెట్టింది.

రేడియో (సన్నగా ఎవరో స్త్రీ) పాడుతోంది. అది తన్మయత్వంతో వింటున్నాడు మంచం మీద వెల్లకిలా పడుకున్న ప్రతాప్. అతను కళ్ళుమూసుకుని చాలా సంతోషంగా వింటున్నాడు.

'ప్రతాప్' పవిత్ర పిలిచింది.

ప్రతాప్‌కి ఆమె గొంతు వినిపించలేదు.

'ప్రతాప్' అంది రెండవసారి. ఈసారి అతను తలెత్తి చూశాడు. మెర్క్యురీలైటు కాంతిలో ఆమెను వెంటనే గుర్తుపట్టాడు. 'నువ్వా' అన్నాడు నిర్ఘాంతపోతూ.

పవిత్ర అవునన్నట్లు తలవూపింది.

'రా పవిత్రా, రా లోపలికి వచ్చికూర్చో' అన్నాడు. అతని గొంతులో మార్దవంపవిత్రని కుర్చీలో కుదేసింది.

'బాగున్నావా' అన్నాడు అతను ఆమెకి కొంచెం దూరంలో కూర్చుంటూ.

'దేవుడి దయవల్ల'

'నువ్వూ పిల్లలూ మీ శ్రీవారూ'

'అందరూ బాగున్నారు. నువ్వూ పిల్లలూ శ్రీమతీ...

'ఆమె లేదు. పిల్లలు యిక్కడ వుండరు.' ప్రతాప్ లేచి నిలుచుని 'యిప్పుడే వస్తాను' అని వెళ్ళిపోయాడు.

పవిత్ర ఆ యింటిని చూస్తోంది. అంతరాంతరాళాల్లో ఎక్కడో బేరీజులు వేసుకుంటోంది. తన యింటికీ యీ మధ్య బేధాన్ని.

ఐదునిముషాల్లో టీ తయారు చేసుకుని వచ్చాడు అతడు. ఆమె బిడియపడుతూనేవుంది. అతను బలవంతం చేస్తూంటే కాదనలేకపోయింది. బయట సన్నని తుంపర పడుతోంది. చలిగాలి వున్నట్టుండి విసురుగా తగులుతోంది. పవిత్ర గజగజలాడిపోతోంది. మేలిముసుగు నిలవడం లేదు.

'ఇప్పుడు చెప్పు యిప్పుడెందుకువచ్చావు? రావద్దని నేను అనను కానీ అకారణంగా నువ్విలారావు. ఎందుకొచ్చావో తెలుసుకుందామని'

అతన్ని పరిశీలనగా చూసింది. ఎన్నోఏళ్లు జరిగిపోయినా అతని శరీరంలోఎలాంటిమార్పులూలేవు. పూర్వకంటే కొద్దిగా దృఢంగా కనిపిస్తున్నాడు. డబ్బు, దర్పం తెలియజేయవలసిన అవసరం లేకుండానే తెలిసిపోతున్నాయి. అతన్ని చూస్తూంటే అడగవలసిందేదో గొంతులో అడ్డుకున్నట్లయింది.

'చెప్పు పవిత్రా. నీకు నా వల్ల యేదైనా వుపకారం జరిగితే ఆ శుభదినం కోసం నేను ఎదురుచూస్తున్నానని మరచిపోకు.

పవిత్ర నిలుచుంది. ఆమెకు అభిమానం, అవమానం యిలాంటివి ఏవీ తెచ్చిపెట్టుకోవాలని లేదు. 'నువ్వు వూళ్ళోవుంటావో లేదో, నేను ముందుఫోన్ చేసికనుక్కోవలసివచ్చింది. అందుకేమైనా అనుకున్నావా ?'

అతను చిన్నగా నవ్వాడు; నిన్ను నేనేమీ అనుకోను పవిత్రా. నువ్వునా ఆత్మబంధువువి. నీ కోసం నన్నేం చేయమన్నా చేస్తాను'

పవిత్ర కళ్ళల్లో తిరిగే నీటికి బలవంతంగా ఆపుకుంది. తెర మాదిరి వచ్చిన ఆ నీరు కంటికి పూర్తిగా మబ్బులా ఆవరించింది. అతను నీడలా కదుల్తున్నాడు.

'చెప్పు పవిత్రా...'

పవిత్ర చెప్పలేకపోతోంది. ఇద్దరికి గతం కనిపిస్తోంది.

ప్రపంచంలో చిన్నపిల్లలుగాపెరిగిపెద్దయి విడిపోయిన భగ్న ప్రేమికుల మాదిరే ఈ కథ ప్రారంభం అయింది. కులమతాలూ, గొప్పాబీదా తారతమ్యాలూ స్నేహితుల్ని కలవనీయలేదు. ఫాక్టరీలో తన చేతికింద పని చేసే ప్యూన్ కూతురికి తన కొడుకుని యిచ్చేందుకు ప్రతాప్ తండ్రి అంగీకరించలేదు.

ఆడిన ఆటలూ, పాడిన పాటలూ అన్నీ గాలివాటుకి కొట్టుకుపోయాయి పవిత్రగాఢంగా ప్రేమించక పోయినా ప్రతాప్ రూపానికి బదులు సారంగం రూపు మనసులో దిద్దుకుందుకు కొద్దికాలమపడింది. ప్రతాప్ మగవాడే అయినా తండ్రి పరపతిని దృష్టిలో వుంచుకుని తన కోరికలకి సమాధి చేసుకున్నాడు. అతనికి పవిత్రకన్నా తీరని బాధేయేర్పడింది. అదికాలం పరుగుకో ఆనవాలుగా మిగిలిపోయి ది.

'కొ తచీర నీ కోసం తెచ్చాను. కట్టుకుని వెంటనే కనిపించు' ప్రతాప్ పాకెట్ అందించాడు.

మోకాళ్ళవరకూ జారే జడని దువ్వీదువ్వీ వేసుకుంది. గుండ్రంగా వున్న కళ్ళు మొహానికి అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది. ఆమె అతని వైపు ఆరాధనగా చూసింది. అతని చేతిలో ఆమె కుటుకుట్టి అల్లికలు అల్లి సంపాదించిన డబ్బుతో కొన్న పార్కర్ పెన్నువుంది. ఆమెవొంగి నమస్కరించింది. అతను ఆమెశిరస్సు మీద చేతిని వుంచాడు... ఆతరువాత అంతులూ, అవరోధాలూ... చకచకా జరిగిపోయాయి. యిన్నేళ్ళ తరువాత మళ్ళీ యిక్కడ ఈ స్థితిలో...

'బాబాయ్ ఇల్లు అమ్ముతున్నారని విన్నాను' నా దగ్గర బంగారం సూత్రం గొలుసుతో కలిసి రెండువేలు వున్నాయి. ఆయనకి ఫ్యాక్టరీ యిచ్చే లోన్‌తో మరో రెండువేలు అవుతాయి. మొత్తం పదివేలు ఆ రెండు గదులూ వసారా వున్న యిల్లు. నేను నీకు నెల నెలా యింత అని బాకీ తీరుస్తాను. నాకు ఆ యిల్లు అని చెబితే ... బాబాయ్ అసలు యివ్వరేమో నువ్వు సర్దుబాటు చేసి నా పిల్లలకి నా భరకి నీడ చూపించు ప్రతాప్. నేను...నేనేమైనా పరవాలేదు ... పవిత్రకి దుఃఖం ఆగలేదు వుప్పెనలా ముంచుకువస్తోంది. దారిద్ర్యం బాధకి తట్టుకోలేకా, యింటి అద్దె చెల్లించలేకా ఎంత దిగజారిపోయింది ... అంతరాత్మ ఆమెవైపు జాలిగా చూసింది. స్నేహానికి కళంకం దేనికి అతడు అన్నట్లే తను ఆ ప్రబంధువు కాదా అతనికి. అవును...ఖచ్చితంగా అతడు తన స్నేహితుడే చిరకాలం తీపిగురుతుగా మిగిలింది అతనిలో జరిగిపోయిన ఆ విడదీయలేని పవిత్రమైన బంధమే యిప్పుడలా కలిసేట్లు చేసింది.

అంతా విని ప్రతాప్ నిట్టూర్చి. 'యిదా నువ్వు కోరేది ... రేపు నేను నోఖర్ని పంపుతాను మరి నువ్వు రావలసిన అవసరంలేదు! అన్నాడు.

పవిత్ర అతనివైపు నిర్ఘాంతపోయి చూసింది. అతను ఆమెవైపు చూడలేదు. అతను అన్నమాటల్లో అర్థం ఏమిటో ఆమెకు అంతుబట్టలేదు. 'యిదా నువ్వు కోరేది' అంటే...పవిత్రకి తనమీద తనకే జుగుప్స కలిగింది. ఆమె తలుపు తెరుచుకుని చీకట్లో కలిసిపోయింది.

అతను కన్నీటికి ఎడమచేతో తుడుచుకున్నాడు. 'నువ్వు కోరితే నేను కింగ్స్‌వేలో వున్న మేడనే రాసి యివ్వకపోయేవాడినా...' అని.

వారం తరువాత ఆమె పేర రిజిష్టర్ వుత్తరం వచ్చింది. జరిగిందంతా ఆమె సారంగానికి చెప్పింది. అతను 'పిచ్చిదానా'. అన్నాడు ఆవేళ. యీ రోజు కవరు విప్పి నిర్ఘాంతపోయాడు.

పవిత్రా,

నా ఆశీస్సులు నీకు. నువ్వే కోరితే నీకు నేను ఏది యివ్వను. నీ కోరిక చెల్లించేందుకు నాకు చిన్నతనం అనిపించింది. నా చెల్లెలు బాధపడుతూంటే నేను స్వార్థంతో మేడల్లో సుఖంగా వుండలేను. అందుకే నీకు మనం స్కూలుకు వెళ్ళేదారిలో నాన్నగారికోసం ఆగి డబ్బు తీసుకునే వాళ్ళం ఆ యిల్లంటే నాకెంత ప్రేమ, ఆ యింట్లో నాన్నగారు నాకెంత డబ్బు యిచ్చారో నీక్కూడా తెలుసు. ఆ యింట్లో నేను సంపాదించినట్లే మా ఫ్యాక్టరీలో మీ ఆయన సారీ ఆయన మా నాన్నగారి ద్వారా సంపాదించాలనే కోరికతో నీకా యిల్లుకొని యిందులో నీ పేర రిజిష్టరైనట్లు పంపుతున్నాను. మిగిలిన సంతకాలకే, మిగిలి వున్న పనులకూ ఆయన్ని నా దగ్గరకు పంపునేనిది. దయాభిక్షగా యిస్తే తీసుకోవు నాకు తెలుసు ఆ సంగతి. సారంగంగారికి ఫోర్‌మన్‌గా ఆర్డర్స్ త్వరలోనే వస్తున్నాయి. అతనేమీ క్వాలిఫికేషన్ లేనివాడు కాదు దేవుడి దయవల్ల.

నీ క్షేమం కోరే ప్రతాప్.

సారంగం కళ్ళల్లో నీరు నిలిచింది. భార్య అతణ్ణి అపార్థం చేసుకుంది. 'పవిత్రా' అతని కేక విని వచ్చిన పవిత్ర వుత్తరం చదివి సారంగం భుజంమీద ప్రేమగా చేతులుంచింది.